'జగనన్న సురక్ష'తో పేదలకు మేలు

- ఎలాంటి ఖర్చు లేకుండా ధ్రువ పత్రాల మంజూరు
- వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల



సభలో పాల్గొన్న ప్రజలు



మాట్లాడుతున్న అక్కరమాని విజయనిర్మల

ఆరిలోవ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంతో పేదలకు ఎంతో మేలు జరుగుతోందని వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల తెలిపారు. జీవీఎంసీ పదో వార్డులో బుధవారం జగనన్న సురక్ష సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎలాంటి ఖర్చు, శ్రమ లేకుండా ప్రజలకు అవసరమైన పలు రకాల ధ్రువపత్రాలు అందిస్తున్నామన్నారు. కుల ధ్రువీకరణ పత్రం, జగనన్న ఇళ్లు, బర్త్, డెత్, పింఛన్, రేషన్ కార్డులు, తదితర వాటి కోసం అర్హులైన వారితో వలంటీర్లు దగ్గరుండి దరఖాస్తులు చేయించారన్నారు. వాటిని పరిశీలించి అర్హత ఉన్న వారికి ఆయా విభాగాల అధికారులు ధ్రువ పత్రాలు మంజూరు చేశారని ఆమె తెలిపారు. ప్రజలు వద్దకే అధికారులు వచ్చి ధ్రువ పత్రాలు మంజూరు చేసే కార్యక్రమం చేపట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందరం కృతజ్ఞతలు తెలుపుకోవాలన్నారు. వార్డులో సుమారు 1,230 మంది పలు రకాల సర్టిఫికెట్ల కోసం దరఖాస్తులు చేయగా.. 1,121 మందికి ధ్రువ పత్రాలు మంజూరైనట్లు తెలిపారు. అనంతరం మంజూరైన సర్టిఫికెట్లను లబ్ధిదారులకు విజయనిర్మలతో పాటు అధికారులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెండో జోన్ కమిషనర్ కనకమహాలక్ష్మి, రూరల్ తహసీల్దారు ఎస్.రమణయ్య, వార్డు ప్రత్యేక అధికారి రమేష్, సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు జగ్గుపల్లి అప్పలరాజు, వైదా నారాయణరావు, శ్రీను, బీజపు పైడిరాజు, కె.ఎస్.చలం, మొల్లి వెంకటరమణ, కృష్ణ పాల్గొన్నారు.

ఇంటికి వచ్చి దరఖాస్తు చేయించారు..



నాకు కుల ధ్రువీకరణ పత్రం అవసరమైంది. దాని కోసం ఎక్కడికి వెళ్లాలో, ఎవరిని కలవాలో తెలియదు. మా వీధిలో ఉన్న వలంటీర్ శారదకు ఈ విషయం చెప్పాను. ఆమె నాలుగు రోజుల క్రితం మా ఇంటికి వచ్చి నాతో దరఖాస్తు చేయించింది. ఈ రోజు జగనన్న సురక్ష సభలో సర్టిఫికెట్ ఇచ్చారు. చాలా సంతోషంగా ఉంది.

– చంద్రమ్మ, ఆదర్శనగర్, పదో వార్డు,

ఆస్పత్రికి వచ్చి పింఛన్ ఇచ్చారు..

బీచ్ రోడ్డు: గత ప్రభుత్వ హయాంలో పింఛన్ కోసం వార్డు ఆఫీసుకు వెళ్లి క్యూలో నిల్చొని ఉంటే.. చాలా సేపటికి అందుకునే వాళ్లం. ఒక్కో నెల రెండు, మూడు రోజులు పట్టేది. ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్ వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి ఒకటో తేదీనే ఉదయం వచ్చి పింఛన్ అందిస్తున్నారు. ఇటీవల నా కాలికి శస్త్ర చికిత్స కోసం ఆస్పత్రిలో జాయిన్ అయ్యాను. ఆ సమయంలో వలంటీర్ సంపత్‌కుమార్ ఆస్పత్రి వచ్చి నాకు పింఛన్ డబ్బులు ఇచ్చాడు. ఆ డబ్బులతో మంచి ఆహారం తీసుకోగలిగాను. వలంటీర్ల వ్యవస్థ మాలాంటి వృద్ధులకు ఎంతో ఉపయోగం.

– ఎ.సోములు, పీతానివీధి, 28వ వార్డు



ఆస్పత్రిలో పింఛన్ డబ్బులు అందిస్తున్న వలంటీర్ సంపత్‌కుమార్(ఫైల్)

పథకాల కోసమే వివరాల సేకరణ



వలంటీర్‌గా నా పరిధిలో పేదలకు సేవ చేస్తున్నానన్న సంతృప్తి ఉంది. ఇది ఒక ఉద్యోగంగా చూడడం లేదు. మేము సేకరించే వివరాలు కేవలం ప్రభుత్వ పథకాలకు అర్హులైన వారి మాత్రమే తీసుకుంటాం. పవన్ కల్యాణ్ అలా మాపై తప్పుడుగా మాట్లాడం సరైన పద్ధతి కాదు. ప్రజలకు చేరువయ్యామన్న అక్కసుతో వలంటీర్లపై బురద జల్లుతున్నారు.

– గౌరీ కామేశ్వరీ రాణి, వలంటీర్, ఊటగెడ్డ

11వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



గాంధీనగర్‌లో రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

ఆరిలోవ: జీవీఎంసీ 11వ వార్డులో పలు చోట్ల అభివృద్ధి పనులకు మేయర్ గొలగాని హరివెంకటకుమారి బుధవారం శంకుస్థాపన చేశారు. గాంధీనగర్‌లో సుమారు రూ.30 లక్షలతో రోడ్లు, శ్రీహరినగర్‌లో రూ.25 లక్షలతో రోడ్లు, కాలువల నిర్మాణం కోసం పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో నగరంలో అన్ని వార్డుల్లోనూ అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. వార్డుల్లో యూపీహెచ్‌సీల నిర్మాణం సాహసోపేతమైన చర్య అని కొనియాడారు. 11వ వార్డు బాలాజీనగర్‌లోని యూపీహెచ్‌సీ గాంధీనగర్, శ్రీహరినగర్, రవీంద్రనగర్, తోటగరువు, బాలాజీనగర్, అన్నానగర్ తదితర ప్రాంతాల ప్రజలకు అందుబాటులో ఉందన్నారు. బాలాజీనగర్‌లో జీవీఎంసీ కల్యాణ మండపం కొత్తగా నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. తోటగరువు ఉన్నత పాఠశాల వెనుక నిర్మాణం చేపడుతున్న రైతుబజార్‌ను నెల రోజుల్లో అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గొలగాని శ్రీనివాస్, గూడుపు అప్పారావు, సతీష్, జీవీఎంసీ ఏఈ వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సేవకు సారథులు వలంటీర్లు



సర్టిఫికెట్ అందజేస్తున్న అక్కరమాని

ఎంవీపీ కాలనీ: ప్రజా సేవలోను, సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంలోను వలంటీర్లు సారథులుగా నిలుస్తున్నారని వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం 18వ వార్డులోని ఎంవీపీ సర్కిల్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయాలు, వలంటరీ వ్యవస్థల ద్వారా ఇప్పటికే పరిపాలన సౌలభ్యాన్ని ప్రజలకు పూర్తి స్థాయిలో అందుబాటులోకి తెచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సురక్ష క్యాంపులతో కొత్త ఒరవడికి నాంది పలికారన్నారు. 18వ వార్డులో 1100 మంది పలు రకాల సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకోగా.. అందరికీ ఈ సభలో సర్టిఫికెట్లను అందజేస్తున్నారన్నారు.

క్యాంపు అనంతరం కూడా ఎవరికీ ఎలాంటి సర్టిఫికెట్ కావాలన్నా వలంటీర్లను సంప్రదించి వారం రోజుల్లోనే పొందవచ్చన్నారు. అనంతరం లబ్ధిదారులకు అక్కరమాని పలు ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఆనంద్‌కుమార్, సీవో తిరుమలరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు పుక్కళ్ల శంకర్, ఎల్లాజీ, కల్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

తిరగకుండానే ఆదాయ ధ్రువపత్రం అందింది



జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రభుత్వం అద్భుతమైన సేవలు అందిస్తోంది. ఎక్కడికి తిరగకుండానే ఈ క్యాంపు ద్వారా ఆదాయ ధ్రువ పత్రం పొందాను. పిల్లల చదువుతో పాటు ఏ పథకానికి దరఖాస్తు చేసుకోవాలన్నా ఈ సర్టిఫికెట్ తప్పనిసరి. గతంలో అయితే అధికారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేది.

– గంధవరపు లక్ష్మి, 18వ వార్డు

ప్రభుత్వం నుంచి పెద్ద ఎత్తున లబ్ధి



ప్రభుత్వ కార్యాలయం నుంచి ఎలాంటి సర్టిఫికెట్ పొందాలన్నా గతంలో రోజువారీ పనులు మానుకొని తిరగాల్సిన పరిస్థితి. ప్రస్తుతం ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష శిబిరం ద్వారా పది నిమిషాల్లోనే సర్టిఫికెట్ అందజేయడం ఆనందం కలిగించింది. అర్హత ఉన్న వారికి ఇంటి తలపుతట్టి మరీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం లబ్ధి చేకూర్చుతోంది. ఇప్పుడు చదువుతో పాటు పలు పథకాలకు అవసరమైన సర్టిఫికెట్లను అందుకున్నాను.

– ఎస్‌కే బాబులాల్, 18వ వార్డు

పేపర్ సంచుల వినియోగం అవసరం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఏయూ క్యాంపస్: పేపర్‌తో తయారు చేసిన సంచుల వినియోగం పెంచాల్సిన అవసరం ఉందని విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. బుధవారం ప్రపంచ పేపర్ బ్యాగ్ డేని పురస్కరించుకుని ఏయూ వీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ పర్యావరణహితంగా నడుచుకోవాలని సూచించారు. విద్యార్థులను భాగస్వాములను చేస్తూ ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం మంచి పరిణామమన్నారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన పేపర్ బ్యాగ్‌లను ప్రదర్శించారు. వీటిని కళాత్మకంగా తీర్చిదిద్దిన విద్యార్థులను అభినందించారు. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి మాట్లాడుతూ రీసైకిల్ చేయడానికి ఉపయుక్తంగా ఉండే కాగితం సంచులను వినియోగించాలనే సందేశాన్ని సమాజంలోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్‌రాజు, ప్రిన్సిపాల్ ఆచార్య టి.శోభశ్రీ, ఎ.నరసింహారావు, డాక్టర్ నాగరాజకుమారి, బోధన సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆచార్య పరమేశ్వరరావుకు సత్కారం



ఆచార్య పరమేశ్వరరావును సత్కరిస్తున్న మానవత ప్రతినిధులు

ఎంవీపీ కాలనీ: ఏయూ పూర్వ ఆచార్యుడు, మానవతా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు ఆచార్య కె.పరమేశ్వరరావును ఆ సంస్థ ప్రతినిధులు ఎంవీపీ కాలనీలో బుధవారం జరిగిన ఓ కార్యక్రమంలో సత్కరించారు. అధ్యక్షుడిగా గతేడాది కాలంగా మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సేవా కార్యక్రమాలపై హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల సంస్థ కొత్త కార్యవర్గం ఎన్నిక జరిగింది. ఈ కార్యక్రమంలో పలువురు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు




నిత్యకల్యాణంలో తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 9.30 నుంచి నిత్య కల్యాణం నిర్వహించారు. ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అలాగే స్వామికి సహస్రనామార్చన పూజ ఘనంగా నిర్వహించారు. 1001 నామాలను పఠిస్తూ స్వామికి అర్చన చేశారు.

పదవీ విరమణ వయస్సు పెంపుపై హర్షం

ఏయూ క్యాంపస్: ఆచార్యుల పదవీ విరమణ వయస్సును 62 నుంచి 65 సంవత్సరాలకు పెంపుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై ఏపీ యూనివర్సిటీ టీచర్స్ ఫెడరేషన్ గౌరవాధ్యక్షుడు ఆచార్య జాలాది రవి ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. విశ్వవిద్యాలయాలలో బోధన సిబ్బంది కొరత తీరేలా నిర్ణయం తీసుకోవడంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఎర్న్‌డ్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ మంజూరు చేయడంపై కూడా హర్షం వ్యక్తం చేశారు.

డాక్టర్ బాబ్జీకి ఐరావతం జాతీయ పురస్కారం



పురస్కారం స్వీకరిస్తున్న డాక్టర్ బాబ్జీ

మద్దిలపాలెం: నగరానికి చెందిన నటుడు, రచయిత, మిసెస్ ఏవీఎన్ డైట్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ బాబ్జీకి ఐరావతం జాతీయ పురస్కారం లభించింది. హైదరాబాద్‌లో ఆదర్శ కళా నిలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ పురస్కారం అందుకున్నారు. ఆదర్శ కళా నిలయం వ్యవస్థాపకుడు చీరాల ప్రకాష్, మూవీ ఆర్టిస్టుల అసోసియేషన్ సభ్యుడు డాక్టర్ ఆర్.మాణిక్, బుల్లితెర నటుడు అశోక్ కుమార్, నటి దివ్య చేతుల మీదుగా ఈ పురస్కారం అందుకున్నట్టు బాబ్జీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు నగరానికి చెందిన ఫిలిం సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు, వివిధ సాహితీ, సాంస్కృతిక సేవా రంగ సంస్థల ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

శ్రీకాకుళం జిల్లా వాసి దుర్మరణం



కోటేశ్వరరావు మృతదేహం

ఆరిలోవ: జాతీయ రహదారిపై బుధవారం జరిగిన ప్రమాదంలో శ్రీకాకుళం జిల్లావాసి మృతి చెందాడు. ఆరిలోవ ఎస్ఐ అప్పారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా బెలమాం గ్రామానికి చెందిన కోటేశ్వరరావు(40) ద్విచక్ర వాహనంపై నాలుగు రోజుల క్రితం విశాఖపట్నం అల్లిపురంలో ఉన్న తన తమ్ముడి ఇంటికి వచ్చాడు. తిరిగి బైక్‌పై బుధవారం శ్రీకాకుళం బయలుదేరాడు. జూపార్కు వద్దకు వెళ్లే సరికి వెనుక నుంచి మధురవాడ వైపు వెళ్తున్న బొలేరా వాహనం కోటేశ్వరరావు బైక్‌ను ఢీకొంది. తీవ్ర గాయాలు పాలై కొన ఊపిరితో ఉన్న అయన్ను స్థానికులు, ట్రాఫిక్ పోలీసులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఓ బాబు ఉన్నారు. మృతుడి చెల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరిలోవ పోలీసులు కేసు నమోదు చేశారు.

16న యాదవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఎంవీపీ కాలనీ: జిల్లా యాదవ ఎంప్లాయీస్ సొసైటీ ఆధ్వర్యంలో యాదవ సామాజిక వర్గ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ప్రదాన కార్యక్రమం ఈ నెల 16న జరగనుంది. ఈ మేరకు బుధవారం ఎంవీపీలో జరిగిన సొసైటీ కార్యవర్గ సమావేశంలో నిర్ణయించినట్లు సంఘం ప్రధాన కార్యదర్శి డొక్కర శ్రీనివాసరావు తెలిపారు. 2023 ఏడాదికి సంబంధించి పురస్కారాల పంపిణీకి విశాఖ, అనకాపల్లి జిల్లాల పరిధిలో 500 మార్కులకు పైగా సాధించిన 10వ తరగతి విద్యార్థులను, ఇంటర్మీడియట్‌లో 900 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులను ఇప్పటికే ఎంపిక చేశామన్నారు. సంఘం అధ్యక్షుడు ఉరుకూటి రాజారావు, శీరం రవి యాదవ్, జోగ నూకరాజు, జగన్, బుద్దాల తాతారావు, మల్లికార్జునరావు, బొట్టా త్రినాథ్‌లక్ష్మి, కోన వెంకటరమణ పాల్గొన్నారు.

ఆరిలోవ సీఐపై డీసీపీకి ఫిర్యాదు

ఆరిలోవ: దారపాలెంలో ఓ స్థల వివాదంలో ఒక వర్గానికి చెందిన రైతులు ఆరిలోవ సీఐ సోమశేఖర్‌పై డీసీపీకి బుధవారం ఫిర్యాదు చేశారు. దీనిపై ఆల్తి శంకరరావు, అతని బంధువులు కలసి బుధవారం వివాదాస్పదమైన స్థలం వద్ద విలేకరులతో మాట్లాడారు. దారపాలెంలో 10/6, 11/1 సర్వే నంబర్లలో సుమారు 10 సెంట్లు తన తండ్రి ఆల్తి అప్పారావు పేరుమీద ఉందన్నారు. అది తాతల నాటి నుంచి తమకు సంక్రమించిందన్నారు. పాస్‌బుక్ కూడా తమ వద్ద ఉందని చెప్పారు. తమ తండ్రి అప్పారావు 2008లో మరణించారని, కానీ తోట చంద్రరావు అనే వ్యక్తి తమ స్థలాన్ని 2022లో తన తండ్రి బతికి ఉన్నట్లు తప్పుడు ధ్రువ పత్రం సృష్టించి జీపీ రాయించి రిజిస్ట్రేషన్ చేయించాడని ఆరోపించారు. ఈ నెల 7న ఆ స్థలంలో ప్రహరీ నిర్మించడానికి కొంత మందితో కలసి వచ్చారన్నారు. దీనిపై 100కి డయల్ చేయడంతో ఆరిలోవ సీఐ సోమశేఖర్ వచ్చి మమ్మల్ని పిలిపించి మీ స్థలం అయితే కోర్టు ఆర్డర్ చూపించాలని అడిగారన్నారు. పాస్‌బుక్ చూపిస్తే అది చెల్లదని సీఐ చెప్పారన్నారు. నిలదీయడంతో తమను కొట్టారని ఆరోపించారు. దీనిపై బుధవారం డీసీపీ–1 విద్యాసాగర్‌నాయుడికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ వ్యవహారంపై ఆరిలోవ సీఐ సోమశేఖర్‌ను వివరణ కోరగా.. దారపాలెం స్థల వివాదంలో ఇరువర్గాలు ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించారన్నారు. డాక్యుమెంట్లు చూపించాలని కోరగా.. ఒక వర్గం వారు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు చూపించారని, వారు గోడ కడితే మరో వర్గానికి చెందిన ఆల్తి శంకరరావు కొందరితో వెళ్లి ఆ గోడను పడగొట్టారన్నారు. దీంతో శంకరరావును డాక్యుమెంట్ లేకుండా స్థలం వద్దకు వెళ్లకూడదని చెప్పాము తప్ప, ఎవర్నీ కొట్టలేదని సీఐ స్పష్టం చేశారు.

ఆరుగురు కోడి పందాలరాయుళ్లకు జైలు

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలో కోడి పందాలు ఆడిన ఆరుగురు వ్యక్తులకు ఏడు రోజుల జైలు శిక్ష విధించారు. ఆరిలోవ సీఐ సోమశేఖర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 8న ఆదర్శనగర్ శ్మశానం పరిసరాలలో కోడి పందేలు నిర్వహిస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎస్ఐ అనిల్‌కుమార్ సిబ్బందితో అక్కడికి చేరుకుని ఆరుగురు పందాలరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 9 పందెం కోళ్లు, రూ.8,920 నగదు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి, బుధవారం కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి ఏడు రోజుల సాధారణ జైల్ శిక్ష విధించి, ఒక్కొక్కరికి రూ.50 చొప్పున జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు. పందెంరాయుళ్లను విశాఖ కేంద్ర కారాగారానికి తరలించామన్నారు.

ఏయూ సమాచారం..

విద్యార్థులకు మౌలిక వసతుల కల్పన

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సైన్స్ కళాశాల హాస్టల్‌లో ఏర్పాటు చేసిన మంచినీటి శుద్ధి యంత్రాన్ని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ బుధవారం ఉదయం ప్రారంభించారు. అనంతరం సైన్స్ కళాశాల పరిధిలోని హాస్టళ్ల మరమ్మతు పనులను ఆయన పరిశీలించారు. పనుల ప్రగతిని చీఫ్ ఇంజినీర్‌ను అడిగి తెలుసుకున్నారు. పనుల నాణ్యతను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజినీర్ ఆర్.శంకరరావు, చీఫ్ వార్డెన్ ఆచార్య కె.రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రీ పీహెచ్‌డీ పరీక్ష కేంద్రాల పరిశీలన



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న రిజిస్ట్రార్ కృష్ణమోహన్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశం పొందిన వారికి ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు నిర్వహిస్తున్నారు. బుధవారం జరిగిన పరీక్ష కేంద్రాలను ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ పరిశీలించారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించడంపై వారు సంతృప్తి వ్యక్తం చేశారు. ఆర్ట్స్ కళాశాల పరిధిలో 99, సైన్స్ కళాశాల పరిధిలో 72, ఇంజినీరింగ్‌లో 73, ఫార్మసీలో 12 మంది పరీక్షకు హాజరయ్యారు. మొత్తం పరీక్షకు 256 మంది దరఖాస్తు చేసినట్లు పరీక్షల విభాగం డీన్ ఆచార్య డి.వి.ఆర్.మూర్తి తెలిపారు.

ఉష్ణోగ్రతల పెరుగుదల పర్యావరణ మార్పులకు కారణం



ప్రసంగిస్తున్న ఆచార్య భానుకుమార్

ఏయూ క్యాంపస్: ఉష్ణోగ్రతల పెరుగుదల పర్యావరణ మార్పులకు కారణమని ఏయూ వాతావరణ శాస్త్ర విశ్రాంత ఆచార్యుడు ఒ.ఎస్.ఆర్.యు.భానుకుమార్ తెలిపారు. ఏయూ అమెరికన్ కార్నర్‌లో అమెరికన్ కాన్సులేట్ జనరల్(హైదరాబాద్), వీఐఈడబ్ల్యూఎస్–ఎంపవరింగ్ పీపుల్(భువనేశ్వర్) సంస్థలు సంయుక్తంగా బుధవారం పాత్రికేయులకు నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. అనంతరం జర్నలిజం విభాగ ఆచార్యుడు డి.వి.ఆర్.మూర్తి మాట్లాడుతూ సాంకేతికత విస్తృతి, ప్రగతిని ఉపయుక్తంగా నిలుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అమెరికన్ కార్నర్ మెంటార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, వీఐఈడబ్ల్యూఎస్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.భీమరావు, ఐఎండీ శాస్త్రవేత్త ఎం.సునంద, ఏయూ జర్నలిజం బీవోఎస్ చైర్మన్ ఆచార్య చల్లా రామకృష్ణ, విభాగాధిపతి ఆచార్య వినయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జాలరిపేటలో సీజనల్ వ్యాధుల కట్టడికి చర్యలు

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 19వ వార్డు పెద జాలరిపేటలో సీజనల్ వ్యాధుల కట్టడికి జీవీఎసీ జోన్–3 అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఇంటింటి సర్వేతో పాటు దోమలు నివారణపై ప్రత్యేక అవగాహన శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఈ చర్యలను జోన్–3 మలేరియా ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పర్యవేక్షిస్తున్నారు. ఈ మేరకు బుధవారం జాలరిపేటలో దోమల నివారణకు మెగా ఫాగింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల నివారణే లక్ష్యంగా జాలరిపేటలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

సీసీ రోడ్డు పనులకు భూమి పూజ



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న అక్కరమాని విజయనిర్మల, గుడ్ల విజయసాయి

మద్దిలపాలెం: జీవీఎంసీ 23వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణానికి బుధవారం వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, కార్పొరేటర్ గుడ్ల విజయసాయి, పార్టీ వార్డు ఇన్‌చార్జి గుడ్ల సత్యారెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా అక్కరమాని మాట్లాడుతూ రూ.12 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నామన్నారు. వార్డులో అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు అవుతున్నాయన్నారు.

పరిశుభ్రతతో ఆరోగ్యం



పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

బీచ్ రోడ్డు: పరిసరాలు పరిశుభ్రతతోనే ఆరోగ్యవంతమైన జీవితం పొందవచ్చునని వీధి నాటక కళాకారులు స్వచ్ఛత పక్వాడ్–2023 కార్యక్రమంలో భాగంగా ఇండియన్ ఆయిల్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం వైఎంసీఏ వద్ద ప్రత్యేక ప్రదర్శన చేపట్టారు. పరిశుభ్రత, పర్యావరణ కాలుష్యం, ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పించారు. చెత్తను జీవీఎంసీ సిబ్బందికి ఇచ్చేటప్పుడు తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి ఇవ్వాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఇండియన్ ఆయిల్ సంస్థ చేపట్టిన సీఎన్‌జీ, పీఎన్‌జీ ప్రాజెక్టుల కోసం సందర్శకులకు అవగాహన కల్పించారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎంవీపీ కాలనీ: ఈపీడీసీఎల్ పరిధిలోని ఎంవీపీ సెక్టార్–1, 2, గోశి సన్స్, క్యాన్సర్ ఆస్పత్రి చుట్టు పక్కల ప్రాంతంలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. ఎంవీపీ కాలనీ సెక్టార్–1లోని 11 కేవీ ఫీడర్ నిర్వహణ సర్వీసుల్లో భాగంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు సంస్థ ఈఈ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు.

జీఆర్ నగర్ ఫీడర్ పరిధిలో

మద్దిలపాలెం: జీఆర్ నగర్ ఫీడర్ పరిధిలో శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఈఈ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. జీఆర్ నగర్, కృష్ణా మందిరం, ముంతాజ్ హోటల్, ఇసుకతోట, ల్యాన్సమ్, మెయిన్‌రోడ్డు, కొత్త వెంకోజీపాలెం, శివాలయం పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు.